ఇంటర్ ప్రవేశాలకు ప్రచారం

హైస్కూల్ ప్లస్ స్కూళ్లలో లెక్చరర్ల నియామకం పూర్తి



నిడమర్రులో ఏర్పాటు చేసిన హైస్కూలు ప్లస్ (6 నుంచి 12 తరగతులు)

గణపవరం: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో తీసుకు వస్తున్న విప్లవాత్మక మార్పులలో భాగంగా ప్రారంభించిన హైస్కూల్ ప్లస్ తరగతులలో ఇంటర్ ప్రవేశాలకు అధ్యాపకులు ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. కళాశాలలు అందుబాటులోలేని మండలాలలో బాలికలకు ఉన్నత విద్య అందుబాటులోకి తీసుకురావాలన్న ఆశయంతో ప్రభుత్వం ప్రతీ మండలంలో ఒక ఉన్నత పాఠశాలను హైస్కూలు ప్లస్‌గా మార్చి.. వాటిలో ఇంటర్‌ను ప్రారంభించింది. గతేడాది హైస్కూల్ ప్లస్ తరగతుల ప్రారంభం బాగా ఆలస్యం కావడం, తగినంతమంది బోధనా సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో తరగతుల నిర్వహణ అంతంత మాత్రంగానే సాగింది. దీంతో ఈ ఏడాది ఆరంభం నుంచే ప్రభుత్వం హైస్కూలు ప్లస్ విధానంలో ఇంటర్‌లో పూర్తిస్థాయి ప్రవేశాలు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఇప్పటికే పీజీటీ అర్హత కలిగిన ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతి ఇచ్చి గత వారమే నియామకాలు పూర్తిచేసింది.

అన్ని హైస్కూల్ ప్లస్‌ల్లో ల్యాబ్‌లు

అన్ని హైస్కూలు ప్లస్‌ల్లో సైన్స్ లేబొరేటరీలు అందుబాటులోకి తెచ్చింది. దీంతో ఆయా కళాశాలలలో జేఎల్స్‌గా నియమితులైనవారు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో విద్యార్థులను చేర్చుకోవడానికి గ్రామాలలో ప్రచారం చేస్తూ అడ్మిషన్‌లు సేకరిస్తున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో నాలుగు హైస్కూళ్లలో జూనియర్ ఇంటర్ ప్రారంభించారు. గణపవరం బాలికోన్నత పాఠశాల, నిడమర్రు ఉన్నత పాఠశాల, ఉంగుటూరు ఉన్నత పాఠశాల, గుండుగొలను ఉన్నత పాఠశాలలను హైస్కూలు ప్లస్‌గా మార్చారు. ఈ కాలేజీలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో ఏవైనా రెండు గ్రూపులను ప్రారంభించడానికి, ఒక్కో గ్రూపులో 40 మంది చొప్పున మొదటి సంవత్సరంలో 80 మంది విద్యార్థులను చేర్చుకోవడానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. దీంతో నూతనంగా నియమితులైన అధ్యాపకులు గ్రామాలలో ప్రచారం ప్రారంభించారు.. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఏర్పాటు చేసిన నాలుగు బాలికల జూనియర్ కాలేజీల్లో ఈ ఇంటింట ప్రచారం జోరుగా సాగుతోంది. ఇంతవరకూ దాదాపు 80 మందికిపైగా విద్యార్థులను ఇంటర్ మొదటి సంవత్సరంలో చేర్చుకున్నారు. ఈ నెలాఖరుకల్లా 50 శాతంపైగా సీట్లు భర్తీ చేయడానికి కృషి చేస్తున్నారు. జూన్ మొదటివారంలో పదోతరగతి ఇన్‌స్టెంట్ ఎగ్జామ్ ముగిసిన తర్వాత ప్రవేశాలు మరింత పెరిగే అవకాశం ఉందని అధ్యాపకులు అంటున్నారు.

ప్రభుత్వ పథకాలన్నీ వర్తిస్తాయి



హైస్కూలు ప్లస్‌లో ఇంటర్‌లో చేరే విద్యార్థులకు ఎలాంటి ఫీజు లు ఉండవు. జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాదీవెన తదితర పథకాలన్నీ వీరికి వర్తిస్తాయి. ఆయా గ్రామాల విద్యార్థులు అందుబాటులో ఉన్న ఇంటర్ విద్యను వినియోగించుకోవాలని ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం. ఇంతవరకూ 25 మంది విద్యార్థులను నమోదుచేసుకున్నాం.

– యర్రంశెట్టి శేషగిరిరావు, నిడమర్రు హైస్కూలు ప్లస్ హెచ్‌ఎం

అండర్‌పాస్ నిర్మాణం అభినందనీయం



మానవత సభ్యుడు బి.ఆంజనేయులను సత్కరిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: చేబ్రోలులో రైల్వే ట్రాక్‌కు అనుమతులతో అండర్‌పాస్ నిర్మించిన బి.ఆంజనేయులు ఆదర్శప్రాయుడని మానవత రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి అన్నారు. ఆదివారం చేబ్రోలులో మానవత కార్యవర్గం సమావేశం నిర్వహించారు. గోపి మాట్లాడుతూ మానవతకు మెదటి ప్రీజరు ఆంజనేయులు అందించారని అన్నారు. కైకరానికి చెందిన గంటా గోపి గుండెపోటుతో మరణించడంతో అతని కుటుంబానికి రూ.ఆరువేలు ఆర్థిక సాయం అందజేశారు. పేద విద్యార్థి చల్లా ఏంజల్‌కు ఇంటర్ చదవడానికి ఆర్థిక సాయం అందజేయాలని సభ్యులు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మానవత మండల అధ్యక్షుడు వేగేశ్న సూర్యనారాయణరాజు, మానవత సభ్యులు గుణ్ణం బుల్లియ్య, అడపాశ్రీనివాసు, బొమ్మిడి అప్పారావు, కార్యదర్శి గంజి రవి కోనేసత్యనారాయణ కర్నాటి నాగేంద్ర పాల్గొన్నారు.

క్లుప్తంగా

31న కోదండ రామాలయం పునఃప్రతిష్ఠ



పోతునూరు కోదండ రామాలయం

దెందులూరు: పోతునూరు పంచాయతీలోని కొత్తూరులో ఉన్న కోదండ సీతారామ లక్ష్మణభరత ఆంజనేయస్వామి ఆలయం పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో 31న ఉదయం 8.14 నిమిషాలకు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు రామాలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని స్వామివార్ల ఆశీస్సులు పొందాలని కోరారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ గ్రంథాలయాధికారి విగ్రహాలను ఆలయ కమిటీకి వితరణ చేశారు.

ఏఎంసీ అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని కలిసిన ఏఎంసీ చైర్మన్ అప్పనప్రసాద్, వైస్ చైర్మన్ కాటి సుధాకర్

దెందులూరు: ఏఎంసీ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి కృషి చేస్తామని దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, వైస్ చైర్మన్ కాటి సుధాకర్ అన్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు కలిసి పుష్పగుచ్ఛం అందించి పదవుల్లో నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు గాలాయగూడెంలో గడపగడపకు..

దెందులూరు: గాలాయగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొనే ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిలకా వెంకటసుబ్బారావు, సొసైటీ చైర్మన్ తోట అచ్చియ్య, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని నాని కోరారు.

చేబ్రోలులో నేడు ఉచిత వైద్యశిబిరం

ఉంగుటూరు: చేబ్రోలులో సాయిబాబా ఆలయం వద్ద సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు కన్వీనర్ సోలాపురి ప్రసాదు తెలిపారు. ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వైద్యులు ఈ శిబిరంలో సేవలు అందిస్తారని ఆయన చెప్పారు. జనరల్ మెడిసిన్, చెవి, ముక్కు,గొంతు, స్త్రీల వ్యాధులకు సంబంధించి వైద్యసేవలు అందజేయనున్నారని ప్రసాదు తెలిపారు. ఈ శిబిరాన్ని గ్రామంలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు.

పోరాటయోధుడు పట్నాల శ్రీనివాస్

గణపవరం: గణపవరం ఏరియాలో కార్మిక సమస్యలపై నాలుగు దశాబ్దాలుగా ఎన్నో ఉద్యమాలు చేసిన పోరాట యోధుడు పట్నాల శ్రీనివాస్ అని సీపీఎం రాష్ట్ర నాయకుడు మంతెన సీతారామ్ అన్నారు. ఆదివారం గణపవరం ప్రాంత సీపీఎం సీనియర్ నాయకుడు పట్నాల శ్రీనివాస్ సంతాప సభ సరిపల్లె మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు చింతకాయల బాబూరావు, బి.బలరామ్, జె.సత్యనారాయణ, కె.సోమరాజు, జీవీఎల్ నర్సింహారావు, షేక్ వల్లీ, పి.నర్సింహమూర్తి, పి.గోవింద్, ఎం.పెంటారావు, గుత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు



గోపినాథపట్నం ప్రాంతంలో మట్టిని తవ్వి లారీలో తరలిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: కైకరం, గోపినాథపట్నంలో అక్రమంగా మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఆదివారం అధికార్లకు సెలవు కావడంతో ఎవరూ అడ్డుకోరనే నమ్మకంతో అక్రమార్కులు లారీలు, ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్నారు. శ్మశాన వాటికల పూడికతీత, స్థలాల మెరక పనులు అని నమ్మబలికి మట్టిని తరలించి విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ప్రజా ప్రయోజనాలు మసుగులో మట్టి మాఫియా ఆగడాలు పెచ్చుమీరిపోయారు. ఇక్కడ మట్టిని తవ్వి నల్లజర్ల మండలానికి తరలించి విక్రయిస్తున్నట్టు సమాచారం. ఎక్కడ వీలుగా ఉంటే అక్కడ మట్టి తవ్వకాలు సాగిస్తూ సొమ్ములు చేసుకుంటున్నారు.

ఆహ్లాదంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సానిగూడెం తోటలో కలుసుకున్న 1994-95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

దెందులూరు: బాల్యస్నేహితులంతా 29 ఏళ్ల తరువాత కలుసుకోవడం మరిచిపోలేని అనుభూతిని కలిగించిందని 1994–95లో పెదవేగి ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ పాఠశాలలో పదోతరగతి చదివిన విద్యార్థులు అన్నారు. ఆదివారం సానిగూడెం పామాయిల్ తోటలో 29 ఏళ్ల తరువాత అపూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తొలుత 60 మంది విద్యార్థులు ఎవరెవరూ ఎక్కడ ఉంటున్నారు, ఏం చేస్తున్నారు, కుటుంబ సభ్యుల వివరాలు వెల్లడించి ఒకరికొకరు ఆలింగనం చేసుకున్నారు. అన్ని బంధాల్లో కెల్లా స్నేహబంధం విలువైనదని మరువలేనిదన్నారు. ఎంత దూరంగా ఉన్నా అందరం కలుసుకోవాలన్న తాపత్రయం, తపన అందరి మధ్య ఉన్న బంధం 28 ఏళ్ల తరువాత ఒకే చోట కలుసుకోవడానికి దోహదపడిందని పదో తరగతిలో అప్పటి పరిస్థితి, అల్లరి పనులు అన్నింటినీ వివరించారు. తొలుత చనిపోయిన సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తామంతా కలిసి కొంత నిధి ఏర్పాటు చేశామని, విద్యా, వైద్యాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేసేందుకు నిర్ణయించుకున్నామన్నారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించడమే లక్ష్యం



భీమడోలులో మండలస్థాయిలో ఉత్తమ ర్యాంకులు పొందిన బాలికలను సత్కరిస్తున్న దృశ్యం

భీమడోలు: ప్రతిభ గల చిన్నారులను ప్రోత్సహించడమే మానవత స్వచ్ఛంద సంస్థ లక్ష్యమని ఉమ్మడి జిల్లాల మానవత అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు అన్నారు. భీమడోలులోని రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభను కనుబర్చిన పదో తరగతి విద్యార్థినులకు సత్కారం, పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల ఉచిత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల చైర్మన్ గుల్ల నూకరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఆర్.గంగాధరరావు పాల్గొని ప్రతిభ గల పేద విద్యార్థులను ఆదుకుంటామన్నారు. మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన సూదికొండ యామాని ప్రణీత, ఏ.భవ్యశ్రీ, కొండే రితికకు సర్టిఫికెట్లు, ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున ప్రోత్సాహక నగదును అందించారు. పోలసానిపల్లికి చెందిన మొగ్గల సాయిశ్రీ, బుట్టాయిగూడెంకు చెందిన చింతల సత్యనారాయణకు ఉచితంగా ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ, కోశాధికారి గుల్ల నూకరాజు, శాంతి రథాల చైర్మన్ అప్పక రాంబాబు, మండల మాజీ అధ్యక్షుడు ఉన్నమట్ల సత్యనారాయణ, పి.సాంబశివరావు, సభ్యులు అల్లాడ ప్రసాదరావు, ప్రిన్సిపల్స్ యలమర్తి రవీంద్రకుమార్, గేదెల సురేష్, ఉమామహేశ్వరరావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన చక్ర ప్రతిష్ఠ





అలయ ధ్వజ స్తంభంపై ప్రతిష్ఠించిన సుదర్శన చక్రం , నూతనంగా ప్రతిష్ఠించిన ధ్వజస్తంభం

కొయ్యలగూడెం : నూతనంగా నిర్మించిన రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో ధ్వజస్తంభంపై సుదర్శన చక్రాన్ని ఆదివారం ఘనంగా ప్రతిష్ఠించారు. సుమారు 250 సంవత్సరాల క్రితం మదన గోపాల స్వామి ఆలయాన్ని నిర్మించి ఆలయ శిఖరంపై సుదర్శన చక్రాన్ని ఆనాడు ప్రతిష్ఠించారు. పంచలోహాలతో తయారు చేసినట్లుగా పూర్వీకులు పేర్కొంటున్న సుదర్శన చక్రమహిమ రీత్యా దానిని తిరిగి మళ్లీ మెరుగులు దిద్ది ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. గతంలో ఆలయ సందర్శన సమయాల్లో పలువురు పీఠాధిపతులు స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ శిఖరంపై ఉన్న సుదర్శన చక్ర దర్శనం చేసుకుని చాలా మహిమాన్వితమైనదిగా పేర్కొంటూ ఉండేవారని గ్రామస్తులు చెబుతున్నారు.

జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్య సమస్యలు దూరం

జంగారెడ్డిగూడెం : మహిళలు రుతుస్రావ పరిశుభ్రత ఆశవ్యకతను తెలుసుకుని అందుకు అనుగుణంగా జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్య సమస్యలు దరి చేరవని ఏరియా ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ రమ్య అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ రుతుస్రావ పరిశుభ్రతపై మహిళల ఆరోగ్య అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఉన్న అపోహలను పోగొట్టేలా కౌమార బాలికలను భాగస్వాములను చేసి వారితో ర్యాలీ నిర్వహించి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమ్య మాట్లాడుతూ మహిళలకు రుతుస్రావ సమయంలో ప్రతి మహిళా శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌లు, ఏఎన్ఎంలు, ఆశాలు ఆయా అంశాలపై మహిళలకు వివరించారు. రొమ్ము క్యాన్సర్, స్వీయ పరీక్ష చేసుకోవడం, గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌమార బాలికలకు డాక్టర్ రమ్య చే శానిటరీ ప్యాడ్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో వార్డ్ ఇన్‌చార్జిలు, మెప్మా సిబ్బంది, ఆశ వర్కర్‌లు, డ్వాక్రా సంఘ సభ్యులు, నగరపాలక సంస్థ సీవోలు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జీవిత చరిత్రలు చదవాలి



భీమడోలులో చిన్నారులు నీతి కథలు చెప్పే విధానాన్ని పరిశీలిస్తున్న సత్యం ఫౌండేషన్ అధినేత బి.విజయసారథి

దెందులూరు: విద్యార్థులు మహనీయుల జీవిత చరిత్రలు చదివి వారిని ఆదర్శంగా తీసుకోవాలని పోతునూరు గ్రంథాలయాధికారి డీ.జాన్‌బాబు అన్నారు. ఆదివారం పోతునూరు గ్రంథాలయంలో జాన్‌బాబు ఆధ్వర్యంలో, దెందులూరులో గ్రంథాలయాధికారి టీ.ఝాన్సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మహనీయుల జీవిత చరిత్రల పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. కంప్యూటర్ ప్రాథమిక అంశాలను వివరించి, శిక్షణనిచ్చారు.

పుస్తకాలు విజ్ఞాన దీపికలు

భీమడోలు: పుస్తకాలు విజ్ఞాన దీపికలని సత్యం ఫౌండేషన్ అధినేత బాలనాగు విజయసారధి అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతున్నాయి. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన తరగతులను విజయసారధి సందర్శించారు. చిన్నారులు నేర్చుకున్న నీతి కథలను అడిగి తెలుసుకుని వారిని అభినందించారు. అనంతరం చిన్నారులు పుస్తక పఠనం చేసారు. ఈ సందర్భంగా విజయసారధి మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా ఎక్కువ జ్ఞానాన్ని పొందవచ్చన్నారు. చిన్నతనం నుంచి పుస్తకాలను చదవడం ఓ అలవాటుగా మార్చుకుంటే బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకున్నవారవుతారన్నారు. పూళ్ల గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో యోగా గురువు కురెళ్ల కిషోర్ చిన్నారులకు యోగాసనాలపై శిక్షణ అందించారు. గేదెల ఈశ్వరమ్మ భగవద్గీత శ్లోకాలను వివరించారు. గుండుగొలను గ్రంథపాలకురాలు జి.నాగమణి ఆధ్వర్యంలో చిన్నారులకు గేమ్స్ ఆడించారు. చిన్నారులతో వివిధ రకాల క్రీడలు ఆడించారు. పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.



పోతునూరు గ్రంథాలయంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి జాన్‌బాబు

ఇరువురికి ఇళ్ల పట్టాల రద్దుకు పంచాయతీ తీర్మానం

దెందులూరు: సీతంపేట గ్రామంలో పొలం, స్థలం కలిగి జగనన్న ఇళ్ల పట్టాలు తీసుకున్న ఇరువురికి ఇళ్ల పట్టాలు రద్దు చేయాలని సర్పంచ్ పరసా లక్ష్మి సుజాత, దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్యకు సిఫార్సు చేశారు. గ్రామానికి చెందిన కడగళ్ళ లక్ష్మికి సిరివాడలో 1.2 సెంట్ల పొలం, స్థలం ఉంది. పంటల వెంకటలక్ష్మికి శిగవరంలో స్థలం, ఇల్లు ఉందన్నారు. పేదలకు జగనన్న ఇంటి స్థలం ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, ఈ నేపథ్యంలో ఆస్తి ఉన్న ఇరువురికి ఇళ్ల పట్టాలు లభించాయని సర్పంచ్ అన్నారు. దానికి సంబంధించిన వివరాలను, సిఫార్సు లేఖను తహసీల్దార్‌కు పంపించామని తెలిపారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్‌పై శిక్షణ ఇస్తున్న రిసోర్స్‌పర్సన్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు శనివారం క్విజ్ పోటీ నిర్వహించారు. నోబుల్ అవార్డు గ్రహీతలైన సీవీ రామన్, అమర్త్యసేన్, శాస్త్రవేత్తలు అబ్దుల్ కలాం, అలెగ్జాండర్ గ్రహంబెల్, థామస్ అల్వా ఎడిసన్, జగదీష్ చంద్రబోస్, వ్యోమగామి కల్పనా చావ్లా జీవిత విశేషాలపై ఈ క్విజ్‌లో పలు ప్రశ్నలు వేశారు. గణిత ఉపాధ్యాయుడు కె.శ్యామ్ సుందర్ విద్యార్థులకు సులభ గణితంపై క్లుప్తంగా వివరించారు. రిసోర్స్ పర్సన్ డి.శ్రీవల్లి విద్యార్థులకు పేపర్‌తో బెలూన్లు తయారీ, న్యూస్ పేపర్‌లతో పుష్పగుచ్ఛాలు తయారు చేయడంలో శిక్షణ ఇచ్చారు.

చంద్రబాబు వైఖరిని నిరసిస్తూ నేడు ర్యాలీ

ఉంగుటూరు: చంద్రబాబు వైఖరిని నిరసిస్తూ సోమవారం ఉంగుటూరులో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నుంచి భువనపల్లి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు వరకూ బైక్ ర్యాలీ నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. ప్రతి పేద కుటుంబం తలెత్తుకుని జీవించేలా అర్హులందరికీ గృహాలు అందించే బృహత్తర కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందని వారన్నారు. రాజధానిలో అక్కచెల్లెమ్మలకు ఇళ్ల నిర్మాణానికి స్థల పట్టాలు అందజేస్తే, వాటిని ఉద్దేశించి టీడీపీ నేత చంద్రబాబు పేదల ఇళ్ల స్థలాలను శ్మశాన వాటికలుగా పోల్చుతూ వ్యాఖ్యానించడాన్ని వైఎస్సార్ సీపీ శ్రేణులు ఖండించాయి. టీడీపీ దుర్మార్గపు వైఖరిని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు నిర్వహించే ర్యాలీ 29వ తేదీ సాయంత్రం 4గంటలకు నియోజకవర్గ కేంద్రం ఉంగుటూరులో ప్రారంభమవుతుందన్నారు. ఈ ర్యాలీ ఉంగుటూరు నుంచి నారాయణపురం, రావులపర్రు, రాచూరు శీతారామపురం నిడమర్రు మీదుగా భువనపల్లి చేరుతుందన్నారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో నిర్వహించే ఈర్యాలీలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని అన్నారు. మండల పార్టీ కన్వీనర్ మరడ మంగరావు ఆధ్వర్యంలో నాయకులు సన్నాహాలు చేస్తున్నారు.

పుంత రోడ్డు అభివృద్ధి చేయాలి



బోడిగూడెం శివారులో అధ్వానంగా పుంతరోడ్డు

కొయ్యలగూడెం : బోడిగూడెం గ్రామ శివారు చింతల పుంత రోడ్డు అభివృద్ధి చేయాలని రైతులు గ్రామ పంచాయతీని వేడుకుంటున్నారు. గ్రామంలోని వ్యర్థాలను పుంత రోడ్డులోకి తీసుకువచ్చి పంచాయతీ సిబ్బంది పారబోస్తున్నారని దీంతో వ్యవసాయ పనులకు వెళ్లే సమయంలో దుర్గంధం భరించలేకపోతున్నామని రైతులు పేర్కొంటున్నారు. వ్యర్థాలను తిన్న పశువులు వ్యాధుల బారిన పడుతున్నాయని రైతులు వాపోయారు. రాత్రి వేళల్లో అడవి జంతువులు వ్యర్థాల దగ్గరకు వచ్చి అనంతరం దగ్గర్లోని పశువుల పాకలపై దాడి చేస్తున్నాయని దీంతో పశువులు బెదిరి పారిపోతున్నాయని పేర్కొంటున్నారు. ఈ విషయం ఈఓపీఆర్‌డీ జ్యోతి దృష్టికి తీసుకువెళ్లగా త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని, డంపింగ్ యార్డును తరలిస్తామని ఆమె తెలిపారు.

పార్లమెంట్ ప్రారంభోత్సవం రాజ్యాంగ విరుద్ధం

ఏలూరు రూరల్ : ప్రధాని నరేంద్రమోదీ మంత్ర తంత్రాలతో పార్లమెంట్ భవనం ప్రారంభించడం రాజ్యాంగ విరుద్ధమని ఏపీ హేతువాద సంఘం జిల్లా అధ్యక్షుడు కడలి రామాంజనేయులు అన్నారు. భిన్న మతాలు, ఆచారాలు, సంస్కృతి కల్గిన దేశంలో ప్రధానమంత్రి ఒక మతాచారం ప్రకారం పార్లమెంట్ ప్రారంభించకూడదని పేర్కొన్నారు. 1955లో అప్పటి ప్రధానమంత్రి పూజలు, పురస్కారాలు లేకుండా ఒక దీపం వెలిగించి నాగార్జునసాగర్ డ్యామ్ ప్రారంభించారని గుర్తు చేశారు. ప్రభుత్వ ప్రతినిధులు ఇలాంటి సంప్రదాయాన్ని అలవరుచుకోవాలని సూచించారు. సెక్యులరిజంకు విరుద్ధంగా ప్రధాని పార్లమెంట్ భవనం ప్రారంభించడాన్ని హేతువాద సంఘం తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

ఊరటనివ్వని ఈదురు గాలులు



ఏలూరులో ఆదివారం సాయంత్రం ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వేసవి కాలం ఎండలతో ఆపసోపాలు పడుతున్న నగర ప్రజలకు రోహిణీ కార్తి ప్రతాపంతో కంటిమీద కునుకు కరువౌతోంది. ఉదయం 8 గంటల నుంచే ఎండ వేడిమి ప్రారంభమై 10 గంటలు దాటిన తరువాత నుంచీ వడగాలుల రూపంలో ప్రజలపై భానుడి ప్రతాపం పెరుగుతూ వస్తోంది. సాయంత్రం దాదాపు 6 గంటల వరకూ ఎండ కాస్తుండగా రాత్రి 10 గంటలకు కూడా వాతావరణంలో వేడిమి మాత్రం తగ్గడం లేదు. అయితే ఆదివారం సాయంత్రం సుమారు 5.30 గంటల ప్రాంతంలో నగరంలో ఈదురుగాలులు వీచి గాలి దుమారం రేగింది. చెట్ల కొమ్మలు ఊగిపోయి ఎండిన కొమ్మలు విరిగి నేలపై పడి ప్రమాద సంకేతాలను చూపాయి. అనంతరం ఆకాశంలో కారుమబ్బులు కూడా కమ్ముకోవడంతో వాతావరణం చల్లబడుతుందని నగర ప్రజలు ఆశగా ఎదురు చూశారు. వర్షం వచ్చేలా కనిపించడంతో తమకు ఊరట లభించనుందని ఆశించిన ప్రజలకు వారి ఆశ ఎంతో సేపు నిలవలేదు. ఈదురు గాలులు, కారుమబ్బుల ప్రభావం కేవలం అరగంట మాత్రమే ఉండి తరువాత అంటే సుమారు 6 గంటల నుంచి తిరిగి వేడి వాతావరణం ఏర్పడి నగర ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది. దీనితో రోహిణి ప్రభావం మరికొన్ని రోజుల పాటు భరించాల్సిందేనా అనుకుంటూ నిట్టూర్పులు విడిచారు.